క్లుప్తంగా

శబరిమలకు స్వాములు



శబరిమలకు బయలుదేరుతున్న మాలధారులు

కొడంగల్ : పట్టణంలోని బండల ఎల్లమ్మ ఆలయం సమీపంలోని అయ్యప్ప స్వామి సన్నిదానం నుంచి అయ్యప్ప మాలధారులు బుధవారం ఇరుముడితో శబరిమలకు బయలుదేరారు. సన్నిదానం అయ్యప్ప శరణుగోషతో మార్మోగింది. గురుస్వామి ఉమాపతి మాలదారులకు ఇరుముడి కట్టారు. పట్టణానికి చెందిన అనంతలక్ష్మి పృథ్వీరాజు దంపతులు అయ్యప్పస్వాములకు సద్ది ఏర్పాటు చేశారు. అన్నదానం చేసి మాలదారులకు సేవా చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు తలారీ గోపాల్, బుక్క విజయకుమార్, మధుసూదన్ రెడ్డి, వెంకట్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వెంకట్‌రెడ్డికి పూలమొక్క అందజేస్తున్న నాయకులు

కొడంగల్ రూరల్ : ప్రభుత్వం నియమించిన ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిని బుధవారం కాంగ్రెస్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు కాంగ్రెస్ పట్టణ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ దాము తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కమిటీ సభ్యుడు వెంకటేశం, రమేష్, రాము, కృష్ణ, కృష్ణంరాజు, బాబు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ సీజ్



ఆధార్ కేంద్రాన్ని సీజ్ చేస్తున్న తహసీల్దార్ తారాసింగ్

తాండూరు టౌన్ : అనుమతి లేకుండా నడుపుతున్న ఆధార్ సెంటర్‌ను బుధవారం తాండూరు మండల తహసీల్దార్ తారాసింగ్ సీజ్ చేశారు. పట్టణంలోని సీసీఐ కాలనీలోని ఓ ఇంట్లో ఒక వ్యక్తి ఆధార్ సెంటర్ కొనసాగిస్తున్నాడు. సెంటర్‌పై స్థానికులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం ఆర్ఐ రాజిరెడ్డితో కలిసి ఆధార్ సెంటర్‌ను తనిఖీ చేశారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్నారని నిర్ధారించుకొని కంప్యూటర్, స్కానర్, ప్రింటర్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. కాగా, తాము అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నామని, మరో రెండు రోజుల్లో అనుమతి వస్తుందని నిర్వాహకులు చెప్పడం విశేషం.

పెట్రోల్ కొరతతో ఇబ్బందులు



పెట్రోల్ బంక్‌లో భారీగా గుమిగూడిన వాహనదారులు

కుల్కచర్ల: పెట్రోల్ బంక్‌ల్లో పెట్రోల్ దొరకకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బుధవారం మండల కేంద్రంలోని రెండు పెట్రోల్ బంక్‌ల్లో ఒకదాంట్లో పూర్తిగా పెట్రోల్ అయిపోవడంతో, మరొక బంక్ వాహనదారులతో నిండిపోయింది. పెట్రోల్ ట్యాంకర్ల సమ్మె చేస్తారన్న ముందస్తు సమాచారంతో బంక్‌లకు వినియోగదారులు క్యూ కట్టారు.

స్పీకర్‌ను కలిసిన ఉపాధ్యాయులు



స్పీకర్‌తో టీయూటీఎఫ్ సంఘం నేతలు

బంట్వారం: టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఆ సంఘం ఉపాధ్యాయులు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి పలు సమస్యలు విన్నవించారు. సర్వీస్ రూల్స్‌ను పరిష్కరించడంతో పాటు సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. హెల్త్ కార్డులను జారీ చేసి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం స్పీకర్‌కు అందజేయగా ఆయన సానుకూలంగా స్పందించారు. సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ మండల అధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి వెంకటేశం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తాండూరు టౌన్: నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



తాండూరు టౌన్: నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నేతలు



సావిత్రిబాయి జయంతిలో వీబీఆర్ సిబ్బంది

సావిత్రిబాయి సేవలు చిరస్మరణీయం

సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. మహిళాభ్యున్నతికి విద్యయే ఆయుధమని తలచి మహిళలకు విద్యాదానం చేసిన సావిత్రిబాయి సేవలు చిరస్మరణీయమన్నారు. చట్టసభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్, విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో వారికి సమ ప్రాధాన్యం ఇవ్వాలని గొంతెత్తి చాటిన వీర వనితాని పలు సంఘాల ప్రతినిధులు కొనియాడారు. సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని మహిళలు ముందుకు సాగాలన్నారు. పలు సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



దౌల్తాబాద్: బాలంపేటలో పూలే జయంతి వేడుకలు



పెద్దేముల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



కుల్కచర్ల: కేజీబీవీలో ..



అనంతగిరి: గురుకుల బాలికల కళాశాలలో



పరిగి: మహనీయులకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే



బొంరాస్‌పేట : సావిత్రిబాయి విగ్రహానికి ఉపాధ్యాయుల నివాళి



దోమ : బొంపల్లి పాఠశాలలో ..

10 లోపు పెండింగ్ చలాన్‌లు చెల్లించండి

పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి

తాండూరు టౌన్ : వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను డిస్కౌంట్‌లో చెల్లించాలని తాండూరు పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పలు వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను వసూలు చేశారు. 485 వాహనాలకు చెందిన పెండింగ్ చలాన్లు రూ. 37,320లను వాహనదారులచే కట్టించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఫోర్ వీలర్ వాహనాలపై 60 శాతం, టు వీలర్, ఆటోలపై 80 శాతం, ఆర్టీసీ బస్సులపై 90 శాతం మేరకు డిస్కౌంట్ ఇచ్చిందన్నారు. కావునా, వాహనదారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 10వ తేదీన ఈ ఆఫర్ ముగియనుందని, అనంతరం వాహనాలను సీజ్ చేయనున్నట్లు చెప్పారు.

పెండింగ్ చలాన్లు కట్టండి

అనంతగిరి: తెలంగాణ ప్రభుత్వం పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల చెల్లింపునకు రాయితీలు ప్రకటించడం జరిగింది. ఈ అవకాశాన్ని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ సీఐ టి.శ్రీను ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టూ వీలర్ వాహనాలకు 80శాతం, త్రీ వీలర్ వాహనాలకు 90శాతం, హెవీ వాహనాలకు 60శాతం రాయితీ కల్పించనున్నట్లు తెలిపారు. పెండింగ్ చలాన్లు కట్టి క్లియర్ చేసుకోవాలని ఆయన సూచించారు.



చలాన్లను వసూలు చేస్తున్న పోలీసులు

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

పరిగి : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో తెలంగాణ ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని కొనియాడారు. తాను ఎల్లప్పుడూ ఉపాధ్యాయుల వెంట ఉంటానని, ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటుపడుతానని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ నైతిక విలువలతో కూడిన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రతి పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి ఎండి.షఫీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బసిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కనకచారి, దయాకర్, యాదయ్య, మండల అధ్యక్షుడు అంజిలయ్య, ఇలియాస్, తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీల అమలుకే గ్రామసభలు

మర్పల్లి: ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసేందుకే ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తు ఫారాలను స్వీకరిస్తున్నామని మండల ప్రత్యేకాధికారి డీఎల్‌పీఓ అనిత అన్నారు. బుధవారం మండల పరిధిలోని వీర్లపల్లి, సిరిపూరం, జంశాద్‌పూర్, ఘణాపూర్ గ్రామాల్లో ఆయా క్లస్టర్ అధికారులు అభయహస్తం ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేసే 5 గ్యారంటీ పథకాల అమలు కోసం లబ్ధిదారుల నుండి పెద్ద ఎత్తున దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదల సంక్షేమం ఆర్థికాభివృద్ధికి ఆరు గ్యారంటీ పథకాలను అమలు ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ముఖ్యఅతిథులుగా హాజరైన కాంగ్రెస్ పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్ రాష్ట్ర జిల్లా సీనియర్ నాయకులు రాములు యాదవ్, సుభాష్ యాదవ్, ఖలీమొద్దీన్‌లు మాట్లాడారు. గత 10 సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం గ్యారంటీ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గణేశ్,ఎంపీడీఓ రాజ్ మల్లయ్య, మాజీ ఎంపీపీ సుమిత్ర, ఏఈ శ్రావణ్ కుమార్, ఏఓ వసంత, మండల విద్యాధికారి విద్యాసాగర్, ఏపీఎం మధుకర్, ఏపీఓ అంజిరెడ్డి, ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

పేదల సంక్షేమానికే పథకాలు



దారూరు: మోమిన్‌కలాన్‌లో..

ఎంపీపీ విజయలక్ష్మి

ధారూరు: గ్రామీణ పేదలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదిగేందుకే ఆరు గ్యారంటీలు అమలు అవుతున్నాయని ధారూరు మండల పరిషత్ అధ్యక్షురాలు జైదుపల్లి విజయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని మోమిన్ కలాన్, అంతారం, దోర్నాల్, స్టేషన్‌ధారూరు గ్రామ పంచాయతీల్లో బుధవారం జరిగిన గ్రామ పరిపాలన సభల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగానే ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ప్రవేశపెట్టిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తులు చేసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

దౌల్తాబాద్: ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కొనసాగుతోంది. బుధవారం అధికారులు గ్రామసభలు ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించారు. సుల్తాన్‌పూర్, బాలంపేట, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభలో జెడ్పీటీసీ మహిపాల్ పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ఏదైనా సందేహం వస్తే నివృత్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుమలస్వామి, తహసీల్దార్ విజయ్ కుమార్ తదితరులున్నారు.

ప్రజాపాలనకు విశేష స్పందన

కొడంగల్ : ప్రజాపాలనకు విశేష స్పందన వస్తోంది. ఆయా వార్డుల ప్రజలు అధిక మొత్తంలో దరఖాస్తులు చేసుకున్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని బూల్కాపూర్, ఐనన్‌పల్లి గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఏఈ రాకేష్‌రెడ్డిలు రెండు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో దరఖాస్తులు తీసుకున్నారు.

గ్రామసభలకు అనూహ్య స్పందన

మోమిన్‌పేట: ఆరు గ్యారంటీల అమలులో భాగంగా గ్రామాల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామ సభలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ప్రజలు ఎంతో ఉత్సాహంగా దరఖాస్తులను అధికారులకు అందజేస్తున్నారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ఒకే దరఖాస్తులో చేసుకోవాలని సూచించారు.

సంక్షేమ పథకాలతో లబ్ధి

పరిగి: ప్రజాపాలన కార్యక్రమాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వెంకటరామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సయ్యాద్‌పల్లి తదితర గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తామన్నారు. ప్రజలు, ప్రభుత్వానికి వారధిగా ప్రజాప్రతినిధులు ఉంటారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

దోమ : అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సర్పంచులు వెంకటనర్సమ్మ, సత్యమ్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఖమ్మంనాచారం, కిష్టపూర్ గ్రామాల్లో ఆరు గ్యారంటీలకు దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా ప్రజలకు అందించేందుకే నేరుగా ప్రజల వద్దే దరఖాస్తులను స్వీకరించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాం, ఏఓ ప్రభాకర్‌రావు, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతుకుమార్, ఉపసర్పంచ్ రమేశ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ నర్సింహచారి, ఆయా గ్రామాల నేతలు, ప్రజలు పాల్గొన్నారు.



దౌల్తాబాద్: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

జోరుగా గ్రామసభలు

ధారూరు: మండలంలోని మోమిన్‌కలాన్ అంతారం, దోర్నాల్, స్టేషన్‌ధారూరు గ్రామ పంచాయతీలలో బుధవారం జరిగిన ప్రజాపాలన గ్రామసభల్లో 1,529 దరఖాస్తులు వచ్చినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి తెలిపారు. బుధవారం జరిగిన 20 జీపీల్లో 7,456 కుటుంబాలకు గాను 8,209 దరఖాస్తులు అందినట్లు ఆయన వివరించారు.

ప్రజల వద్దకే పాలన

కొడంగల్ రూరల్ : ప్రజల వద్దకే పాలన అందించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను కొనసాగిస్తోందని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అన్నారు. బుధవారం మండలంలోని అంగడిరాయిచూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కౌంటర్లను ఏర్పాటు చేసి అధికారులు దరఖాస్తులను తీసుకుంటున్నారని అన్నారు. లబ్ధిదారులు ఎలాంటి అపోహలకు గురికాకుండా దరఖాస్తులను అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు గోవిందు, వైస్ ఎంపీపీ రహమతుల్లా, మండల స్పెషల్ ఆఫీసర్ స్టీవెన్‌నీల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంతు, మాజీ జెడ్పీటీసీ బాస్కర్, డిప్యూటి తహసీల్దార్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

1152 దరఖాస్తుల స్వీకరణ

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ప్రజాపాలనలో ఆరు గ్యారంటీ పథకాలకు లబ్ధిదారుల నుంచి 1152 దరఖాస్తులు స్వీకరించినట్లు మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుభాషిణి తెలిపారు. ఈమేరకు ఆమె బుధవారం పలు గ్రామాలను సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు.కార్యక్రమంలో ఎంపీపీ చంద్రకళ, ఎంపీడీఓ సత్తయ్య, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆహార నియమాలు తప్పనిసరి



ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్న విద్యార్థులు

పూడూరు: ఆరోగ్యం అదుపులో ఉంచుకోవాలంటే ఆహార నియమాలు పాటించాలని హెచ్‌ఎం మధు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కడుమూరు పాఠశాలలో ఫుడ్ పెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు సమతూల్య ఆహారం తీసుకుంటే పిల్లల ఎదుగుదల బాగుంటుందన్నారు. వివిధ రకాల ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తయారు చేసిన పలు వంటకాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖాజామోహినోద్దీన్, హరీశ్, అనూష, రమాప్రసాద్, మల్లేశ్, శ్రీనివాస్, ఎస్‌ఎంసీ చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభను విజయవంతం చేయాలి

మర్పల్లి: నేడు (గురువారం) మండల కేంద్రంలో జరిగే అభయహస్తం ప్రజాపాలన కార్యక్రమాన్ని పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు రాములు యాదవ్‌లు అన్నారు. గ్రామ సభ వికారాబాద్ శాసనసభ ఎమ్మెల్యే శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరు కానున్నారని వారు పేర్కొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో బోధించుటకు అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిస్టరీ–1, ఎకనామిక్స్–1 పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హులైన మహిళా అభ్యర్థులు 8లోపు కళాశాలలో హాజరుకావాలని కోరారు.

గిరిజన సంప్రదాయాలు అందరికీ ఆదర్శం



అమ్మవారి పూజలో మనోహర్ రెడ్డి, తదితరులు

కుల్కచర్ల: గిరిజన ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు అందరికీ ఆదర్శమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అర్ధరాత్రి మండలంలోని ఇప్పాయిపల్లి గ్రామపంచాయతీ రోకటిగుట్ట తండాలో నిర్వహించిన తుల్జా భవాని పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పండుగల నిర్వహణలో లంబాడాలు అందరికీ ఆదర్శంగా నిలిచేలా కార్యక్రమాలు చేస్తారని అన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల అందరిలో సమైక్యా భావాలు పెంపొందడంతో పాటుగా మానసిక ప్రశాంతత కలుగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీ సర్పంచ్ సతీష్, నాయకులు హరిశ్చాందర్, బాల్‌రెడ్డి, శంకర్, నర్సింలు, వెంకట్ పాల్గొన్నారు.